క్లుప్తంగా

ఘనంగా బోనాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని దుర్గా మాత సన్నిధిలో శుక్రవారం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, గ్రామపెద్దలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మల్లన్నస్వామికి పూజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సాదుల్లానగర్ గ్రామంలో కొనసాగుతున్న మల్లన్న జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాగా హత్నూర శివాలయంలో శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండల పరిధిలోని చౌకన్‌పల్లి ఎంపీటీసీ జాదవ్ కిరణ్‌నాయక్‌తో పాటు ఆయన అనుచరులు ఖేడ్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి జనవాడే సంగప్ప ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో శనివారం ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో కిషన్, సురేష్, సర్దార్, సంతోష్‌నాయక్, జాగిర్, రాంరావు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఆపద సమయంలో పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.50 వేల ఎల్‌ఓసీని శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శనివారం అందజేశారు.

విరాళం అందజేత

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ఎంపల్లి కాశీవిశ్వనాథుడిని ఆలయ అభివృద్ధికి తడ్కల్ గ్రామానికి చెందిన సంతోష్ టీచర్ సొంతంగా రూ.2.42 లక్షలు, ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కల్యాణ మంటపానికి 500 కుర్చీలను విరాళంగా అందజేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఎంపల్లి కాశీవిశ్వనాథుడిని ఆలయ ఉత్సవాలకు కామారెడ్డి జిల్లాలోని పిట్లం, జుక్కల్, బాన్సువాడ, నిజాంసాగర్ మండలాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

గుండెపోటుతో మురియాద్ అలీ మృతి

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ మురియాద్ అలీ గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మురియాద్ అలీ మృతి చెందడంపై గ్రామపెద్దలు సంగమేశ్వర్‌గౌడ్, వీరారెడ్డి, మధుసూదన్ తదితరులు సంతాపం ప్రకటించారు.

వేంకటేశ్వరస్వామికి అభిషేకం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మహాశివరాత్రిని పురస్కరించుకొని మండల పరిధిలోని వెంకటాపూర్, కంబాలపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మోడెం సాగు.. రాబడులు బాగు

- చెరుకు పంటలో మెలకువలు పాటిస్తే మేలు
- మొక్క వేళ్లను దున్నడం ద్వారా ఆశాజనక ఫలాలు
- చెరకు చెత్తతో మరింత ప్రయోజనం
- యాజమాన్య పద్ధతులతో దిగుబడులు



పిలకలు వేసిన మోడెం రెండో చెరకు పంట

'మోడెం(రెండో పంట) చెరకు పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.. రైతులు మోడెం తోటలపై శ్రద్ధ చూపకపోవడం మూలంగా చెరకు దిగుబడులు పడిపోతున్నాయి. జహీరాబాద్ ప్రాంతంలో చెరకు దిగుబడులు ఎకరానికి సగటున 40టన్నుల మేర ఉన్నప్పటికీ మోడెం తోటల్లో 20 నుంచి 22టన్నులకు మించి రావడంలేదు. యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా ఫస్ట్ క్రాప్ కంటే రెండో పంటలో అధిక దిగుబడులను సాధించవచ్చు' అని వ్యవసాయశాఖ జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. – జహీరాబాద్ టౌన్

మెలకువలు పాటిస్తే దిగుబడులు



చెరకు మోడం(రెండో పంట) సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. యాజమాన్యాల పద్ధతుల ద్వారా ఫస్ట్ క్రాప్ కంటే రెండో పంటలకు పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువ వస్తుంది. చెరకు తోటలు కటింగ్ చేసిన తరువాత ఆకులను కాల్చకుండా కుళ్లినట్లు చేస్తే సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. సక్రమంగా నీటి తడులు ఇస్తూ తగిన మోతాదులో ఎరువులు వాడినట్లయితే అధిక దిగుబడులు వస్తాయి.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

పాటించాల్సిన పద్ధతులు

- చెరకు పంటను నరికిన వెంటనే మోడులను భూమికి సమాంతరంగా నరికి వేయాలి. ఇలా చేయడం ద్వారా పిలకలు భూమి లోపల నుంచి బలీయంగా ఎదిగి వస్తాయి. పిలకలు అధికంగా రావడం ద్వారా పంట దిగుబడులు మరింత పెరిగేందుకు దోహదపడుతుంది.
- చెరకు చెత్తను కాల్చివేయకుండా ఆకులు కుళ్లనట్లు చేసి సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలి. ఇలా చేయడం ద్వారా ఎకరానికి 3నుంచి 4టన్నుల మేర సేంద్రియ ఎరువు లభిస్తుంది.
- చెరకు నరికిన వెంటనే నీటి తడి ఇచ్చిన తర్వాత అదును చూసుకొని బొదెను నాగలితో రెండు పక్కల దున్నాలి. ఇలా దున్నిన సాళ్లలో యూరియా రెండు బస్తాలు, ఎస్‌ఎస్‌పీ నాలుగు బస్తాలు, ఎంఓపీ బస్తా వంతున వేయాలి. ఆ తర్వాత పక్కన నాగలితో దున్నినట్లయితే ఎరువు పూర్తిగా కప్పబడి చెరకు పంట ఏపుగా పెరుగుతుంది.
- బోదెను చీల్చడం ద్వార పాత వేరు తెగి కొత్త వేళ్లు అభివృద్ధి చెందుతాయి. ఈ కొత్త వేళ్లు చురుకుగా ఉండి భూమిలోని పోషకాలను, నీటిని, గాలిని గ్రహించి వేళ్లకు శక్తి మరింత పెరుగుతుంది.
- దున్నడం ద్వారా వేళ్లకు కావాల్సిన గాలి అంది మొక్క పెరుగుదల వృద్ధి చెందడంతో పాటు పిలకలు అధికంగా వచ్చే అవకాశముంది.
- మోడెంలో మొక్కలకు మొక్కలకు మధ్య రెండు నుంచి మూడు అడుగుల ఖాళీలు ఉన్నట్లయితే నింపడం ద్వారా పంట దిగుబడి పెరుగుతుంది.
- మోడెం తోటల్లో రైతులు బోదెలను దున్నిన వెంటనే మట్టిని మోదులపైకి ఎగదోస్తున్నారు. దీని వలన పిలకల శాతం గణనీయంగా తగ్గి పంట దిగుబడులు పడిపోయే ప్రమాదముంది. మోడులపైకి రెండు నెలల వరకు మట్టిని ఎగతీయకుండా చూడాలి. మోడెం తోటలకు ఫస్ట్ క్రాప్ తోట కంటే ఒకటిన్నర శాతం ఎక్కువ నత్రజని వాడాలి. ఇలా మెళకువలు పాటిస్తే రెండో పంటలో దిగుబడి పెరుగుతుందని ఏడీఏ పేర్కొన్నారు.

ఎన్నికల ప్రచారం షురూ..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ నాయకులు అప్పుడే ప్రారంభించారు. ఎన్నికల షెడ్యూల్ ఇంకా వెలువడలేదు. కానీ.. జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణఖేడ్‌కు చెందిన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ పేరును ఆ పార్టీ అదిష్టానం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.. ఈ మేరకు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కగ్టి మండల పరిధిలోని దెగుల్వాడిలో శనివారం వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా సురేష్ షెట్కార్‌ను గెలిపిస్తే ఎమ్మెల్యే నిధులతో పాటు ఎంపీ నిధులతో ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టవచ్చని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ధరణి స్పెషల్ డ్రైవ్

కంగ్టి(నారాయణఖేడ్): రైతుల భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ నెల 1వ తేదీన ప్రారంభించిన ధరణి స్పెషల్ డ్రైవ్ శనివారంతో ముగిసింది. ఇప్పటివరకు ధరణిలో సమస్యల పరిష్కారానికి నిర్వహించిన గ్రామసభల్లో 509 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ విష్ణుసాగర్ తెలిపారు. అందులో 355 దరఖాస్తులు పరిశీలించినట్లు, మిగతా 155 దరఖాస్తులు పరిశీలనకు ఉన్నట్లు పేర్కొన్నారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్(అందోల్): ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం పూర్తయినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. ధరణిలో దరఖాస్తులు చేసుకున్నవారి సమస్యలను తెలుసుకుని రికార్డులు పరిశీలించామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో 369 మంది వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. రికార్డులను పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులను ప్రదానం చేస్తున్న విజయలక్ష్మి

జహీరాబాద్ టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న శ్రామిక్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వహకులు, ట్రస్టీ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తూ తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు. మహిళలలో దాగి ఉన్న నైపుణ్యంతో పాటు ప్రోత్సహించేందుకు ముగ్గులు, కబడ్డీ, స్కిపింగ్, మనోయాక్షన్ తదితర ఆటల పోటీలను నిర్వహించామని వివరించారు. కార్యక్రమంలో శ్రామిక విజ్ఞాన కేంద్రం సభ్యులు శ్వేత, లలిత, మీనా, లక్ష్మి, పూలమ్మ, నర్సమ్మ సుమలత టీచర్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ నర్సింహులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో...

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని కర్చల్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల ఈజీఎస్ నిధులను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వట్‌పల్లి దర్గాకు గంధం తరలింపు

మునిపల్లి(అందోల్): మండలంలోని బుస్సారెడ్డిపల్లి గ్రామం నుంచి ఒంటెలపై వట్‌పల్లి దర్గాకు డప్పు చప్పుళ్లు, ఆటాపాటల మధ్య భక్తులు గంధంను తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, గ్రామపెద్దలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల వసూలుపై అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలు, బహుళ అంతస్తుల భవనాల సముదాయంలో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ తప్పనిసరిగా ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

కంది(సంగారెడ్డి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని తుంకిళ్ల తండాలో శనివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పంబాల దుర్గాప్రసాద్, బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి

నర్సాపూర్: మున్సిపాలిటీలోని 9వ వార్డులో తాగు నీటి పైపులైన్ లీకేజీకి మున్సిపల్ సిబ్బంది శనివారం మరమ్మతులను నిర్వహించగా, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పనులను పకడ్బందీగా చేయాలని సిబ్బందికి చెప్పారు. అలాగే గుంతలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ వర్క్ ఇన్స్‌పెక్టర్లు భూపాల్, వినీత్ తదితరులు ఉన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడండి



జొన్నపంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు, రైతులు

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద జొన్న, వరి పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని ఇందిరానగర్, మార్డి, కృష్ణాపూర్, ఫత్తేపూర్ శివారులో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నల్లవాగు ప్రాజెక్టు నుంచి సిర్గాపూర్ మండలం పోచాపూర్, కామారెడ్డి జిల్లా పరిధిలోని తిమ్మానగర్ వరకు ఆయకట్టుకు నీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కల్హేర్ మండల రైతుల పట్ల ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. వెంటనే నల్లవాగు ప్రాజెక్టు నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలు కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, కిష్టారెడ్డి, పాల్గొన్నారు.

భద్రప్పస్వామికి పూజలు

మహాశివరాత్రిని పురస్కరించుకొని కల్హేర్‌లో భద్రప్పస్వామి జాతరను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరం చుట్టూ బండ్లు, ట్రాక్టర్లు ఊరేగించారు. అదేవిధంగా ఇందిరానగర్‌లో దుర్గభవానీ మాత జాతరలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రాంసింగ్, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కుస్తీ పోటీలు

సిర్గాపూర్ మండలం జెమ్లా తండా వద్ద ఓంకారేశ్వర మందిరం వద్ద కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. మందిరం పీఠాధిపతి గణేష్ మహరాజ్ ఆధ్వర్యంలో బోనాలను ఊరేగించారు.

కల్యాణం.. కమనీయం...

మహాశివరాత్రిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా వివిధ ఆలయాల్లో శివపార్వతుల కల్యాణంతో పాటు గిరిజా సమేత సంగమేశ్వరస్వామి, భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలను శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



సంగారెడ్డి టౌన్: ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు



పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్



నారాయణఖేడ్: కాశీనాథ్ ఆలయంలో...



కోహీర్: గిరిజాసమేత సంగమేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో కాంగ్రెస్ నాయకులు



జహీరాబాద్: సిద్ధేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



జిన్నారం: కొడకంచి మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత నీలం మధు

'ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యలు సరికావు'

సంగారెడ్డి అర్బన్: ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొదటి తేదీన వేతనాలు చెల్లించడంపై ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యలు సరికావని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యులైన ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం ప్రభుత్వ బాధ్యత, అంతేకానీ రైతుబంధు నలిపివేసి జీతాలు చెల్లించారనడం విచారకరమన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఉద్యోగులకు 15వ తేదీ దాకా వేతనాలు అందని పరిస్థితి ఉండేదన్నారు. మార్చి ఒకటో తేదీన వేతనాలు అందడంపట్ల ఉద్యోగులందరూ సంతోషంగా ఉంటే, రైతుబంధు ఆపి వేతనాలు ఇచ్చారనడం సరికాదన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

కల్హేర్(నారాయణఖేడ్): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి అన్నారు. బీబీపేట్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెన్నం అనిల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో సంగమేశ్వర్, నరేందర్‌రెడ్డి, సాయిలు, శివారెడ్డి, సతీష్, సంతోష్, సాయిబాబా, రాజు, అంజయ్య, రవితేజ పాల్గొన్నారు.